నులి పురుగుల నివారణపై అవగాహన

కోటగిరి, జూన్ 16 : ఈ నెల 20వ తేదీ నుంచి నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ సందర్భంగా ఉమ్మడి కోటగిరి మండలంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సదస్సును ఏర్పాటు చేయనున్నట్లు పొతంగల్ పీహెచ్‌సీ విస్తరణ అధికారి గోవర్ధన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం లేదా బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేసి నులి పురుగుల మాత్రలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

ఆనంద్‌నగర్ పద్మశాలీ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

భూమయ్య, ప్రకాశ్

ఖలీల్‌వాడి, జూన్ 16 : నగరంలోని ఆనంద్‌నగర్‌లో ఉన్న పద్మశాలీ సంఘం 25వ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భీమనాతి భూమయ్య, ప్రధాన కార్యదర్శిగా వైద్య ప్రకాశ్, కోశాధికారిగా రవీందర్, ఉపాధ్యక్షులుగా ఎంబరి గంగాధర్, కర్ణాల సుధాకర్, జాయింట్ సెక్రటరీలుగా బాసరం పండరి, సాయినాథ్, ఆర్గనైజర్‌గా సత్యనారాయణ, ప్రచార కార్యదర్శిగా భూమయ్యతోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం ఐదేండ్ల పాటు పనిచేయనున్నట్లు సభ్యులు తెలిపారు.

తెలంగాణ నుంచి నూతనంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్‌ను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని గోమతి భవన్ నార్త్ బ్లాక్‌లో హోం సహాయ శాఖ కార్యాలయంలో ఆదివారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

– వినాయక్‌నగర్, జూన్ 16

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు

శక్కర్‌నగర్, జూన్ 16: కార్మికులు, కర్షకుల హక్కులు, సమస్యలు ఉద్యమాలతోనే పరిష్కారం అవుతాయని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు అన్నారు. బోధన్ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్మికుల శిక్షణా శిబిరానికి ఆదివారం ఆయన హాజరై మాట్లాడారు. ప్రజల సమస్యలపై సంఘటిత పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడంతోపాటు, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, మౌళిక సదుపాయాలు అమలు చేయడంలో ప్రభుత్వాలు, యాజమాన్యాలు నిర్లక్ష్యం చేయడంతో కార్మిక వర్గానికి కనీస భద్రత లేదని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు లేక కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పలు అంశాలపై సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఎండీ అబ్బాస్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్వీ రమ, సీఐటీయూ జిల్లా నాయకులు ఏ.రమేశ్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్ గౌడ్, కార్యదర్శి నూర్జహాన్, జంగం గంగాధర్, నన్నేసాబ్, కార్మికులు పాల్గొన్నారు.

జలాభిషేకాలు.. బోనాల ఊరేగింపులు

పడిగెల్‌లో వలగొడుగుతో గంగజలాన్ని తీసుకొస్తున్న గ్రామస్తులు

సుంకెట్‌లో బోనాల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

మోర్తాడ్/వేల్పూర్/ఆర్మూర్‌టౌన్/ ఇందల్వాయి, జూన్ 16: జిల్లాలోని పలు గ్రామాల్లో బోనాల పండుగ, గ్రామ దేవతలకు జలాభిషేకం కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మోర్తాడ్ మండలం సుంకెట్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఆదివారం నిర్వహించారు. గంగాజలాలను తీసుకువచ్చి గ్రామంలో బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు బాగుండాలని, ప్రజలు సుఖసంతోషాలతో కోరుతూ గంగాజలాలతో అభిషేకం చేశారు. పోచంపాడ్ గోదావరి నుంచి ఆదివారం తీసుకువచ్చిన గంగాజలాలతో వేల్పూర్ మండలంలోని పడిగెల్ గ్రామంలో వల గొడుగుతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని 60 ఆలయాల్లో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జలాభిషేకం నిర్వహించారు. బాల్కొండ మండలంలో మారమ్మ జాతర నిర్వహించారు. గ్రామంలో పాడి పంటలు బాగుండాలని వేడుకున్నారు. ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి గ్రామంలో కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో దేవతలకు ఆదివారం జలాభిషేకం చేశారు. డప్పువాయిద్యాల మధ్య ఊరేగింపుగా వెళ్లి దేవతలకు బోనాలను సమర్పించారు.

ఇందల్వాయి మండలంలోని దొన్కల్, లింగాపూర్ గ్రామాల్లో గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని, పంటలు బాగుండాలని కోతూ వీడీసీల ఆధ్వర్యంలో ప్రతి ఏడాది జలాభిషేకం నిర్వహిస్తామని గ్రామపెద్దలు తెలిపారు. గ్రామ దేవతలకు మహిళలు బోనాలు సమర్పించి, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామదేవతలకు యాటలను బలిఇచ్చి, వనభోజనాలకు తరలివెళ్లారు.

మామిడిపల్లిలో బోనాల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

ప్రజల కోసం అనేక రచనలు చేసిన గొప్ప వ్యక్తి శ్రీశ్రీ

సభలో మాట్లాడుతున్న ఖాసీం

సుభాష్‌నగర్, జూన్16: తిలక్‌గార్డెన్ న్యూ అంబేద్కర్ భవన్‌లో మహాకవి శ్రీశ్రీ యాదిలో.. కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఓయూ ఆచార్యుడు ఖాసీం హాజరైన మాట్లాడారు. తెలుగు సాహిత్యానికి మకుటం లేని చైతన్య మూర్తి శ్రీశ్రీ అని కొనియాడారు. ప్రజల కోసం అనేక రచనలు చేసిన గొప్ప వ్యక్తి శ్రీశ్రీ అని నగర మేయర్ నీతూ కిరణ్ అన్నారు. శ్రీశ్రీ స్ఫూర్తితో యువత దేశాభిమానాన్ని పెంపొందించుకొని దేశ సేవ చేయాలన్నారు. బిల్లా నాగభూషణం, ఘనపురం దేవేందర్, తిరుమల శ్రీనివాస్ ఆర్య, మద్దుకూరి సాయిబాబు తదితరులు పాల్గొని మాట్లాడారు.

అలరించిన కవి సమ్మేళనం

మహాకవి శ్రీశ్రీ యాదిలో... నిర్వహించిన దివ్య భాష కవి సమ్మేళనం సాహితీ అభిమానులను ఆకట్టుకుంది. కవులు సయ్యద్ రియాజ్ జలాల్ అక్బర్, దారం గంగాధర్, చంద్రశేఖర్, ఘనపురం దేవేందర్, చెన్నశంకర్, సాయిబాబు, తిరుమల శ్రీనివాస్, తొగర్ల సురేశ్ తదితర 25 మంది కవులు పాల్గొని కవితాగానం చేశారు.

యువ సాహిత్య పురస్కార గ్రహీతకు అభినందన

రమేశ్ కార్తీక్

బోధన్, జూన్ 16: తమ పూర్వ విద్యార్థి రమేశ్ కార్తీక్ నాయక్ ప్రతిష్టాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ యువ సాహితీ పురస్కార గ్రహీత రమేశ్ కార్తీక్ నాయక్‌ను బోధన్ పట్టణానికి చెందిన శ్రీ విజయసాయి హైస్కూల్ యాజమాన్యం ఒక ప్రకటనలో అభినందించింది. రమేశ్ కార్తీక్ నాయక్ విజయసాయి హైస్కూల్ పూర్వ విద్యార్థి. రమేశ్ కార్తీక్ నాయక్ తమ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివాడని, గిరిజనుల జీవితాలపై రాసిన తెలుగు కథల సంపుటి 'ఢావ్లో'కు యువ పురస్కారం రావడం తమకు ఎంతో గర్వకారణమని ఆ పాఠశాల కరస్పాండెంట్ ఎస్.కృష్ణమోహన్ హర్షం వ్యక్తంచేశారు. త్వరలో రమేశ్ కార్తీక్ నాయక్‌ను సన్మానించనున్నట్లు ఆయన తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఏర్గట్ల, జూన్ 16: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు పరిసరాల శుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు, స్థానిక వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని ఎంపీపీ శివచరణ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఇండ్ల పక్కన మురికి నీరు నిల్వ లేకుండా, చెత్తను రోజూ వచ్చే గ్రామ పంచాయతీ ట్రాక్టర్లల్లో వేసేలా సూచించాలని ఆయన గ్రామ స్థాయి సిబ్బంది సూచించారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

నవీపేట,జూన్ 16: నాశేశ్వర్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రాజరాజేశ్వర ఆలయానికి రూ.30 లక్షల వ్యయంతో ప్రహరీ, పార్కింగ్ టైల్స్ ఏర్పాటుకు ఆదివారం స్థానిక గ్రామ కమిటీ సభ్యులు భూమిపూజ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గోదావరి నది తీరాన స్వయంభుగా వెలసిన రాజరాజేశ్వరుడు భక్తులకు కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడని అన్నారు. భక్తులకు సౌకర్యార్థం ఆలయంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బినోలా సొసైటీ చైర్మన్ మగ్గిరి హన్మాండ్లు, మాజీ సర్పంచ్ ద్యాగ సరిన్, మాజీ ఉప సర్పంచ్ బాగాజీ లక్ష్మణ్, నాయకులు ఆర్మూర్ శ్రీనివాస్, గంగాధర్, బ్రహ్మయ్య, లింగారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సురేశ్, బాద్గున స్వామి, ద్యాగ రాజేశ్వర్, మోహన్, కిషాన్, నరేశ్, గంగాధర్, రాములు, లింగన్న పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న కమిటీ సభ్యులు

హరితహారంపై గొడ్డలివేటు

చెట్ల ఆనవాళ్లు లేకుండా చేస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

పేపర్‌మిల్ గ్రామ సమీపంలో నరికివేతకు గురైన చెట్లు

రెంజల్, జూన్ 16 : గత కేసీఆర్ సర్కారు హయాంలో భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకొని హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఈ మొక్కలను మూగజీవాలు మేసినా, ఎవరైనా నరికి వేసినా అధికారులు జరిమానా విధించి, కేసులు నమోదు చేసేవారు. కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత చెట్లను కాపాడేవారు కరువయ్యారు. ఏకంగా చెట్లను పూర్తిగా నరికివేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. మండలంలోని రోడ్లకు ఇరువైపులా హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి, చెట్లుగా మారాయి. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను ట్రాన్స్‌కో అధికారులు తొలగించాల్సి ఉండగా.. ఇష్టం వచ్చినట్లు నరికి చెట్లను నేలమట్టం చేస్తున్నారు. కందకుర్తి –పేపర్‌మిల్ ప్రధానరోడ్డుపై సుమారు మూడు కిలో మీటర్ల పొడవునా పెరిగిన హరితహారం చెట్లను ట్రాన్స్‌కో అధికారులు యంత్రాల సహాయంతో ఇటీవల నరికి వేయించారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు కన్నెత్తి చూడడం లేదు. మొక్కల సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అనారోగ్యంతో బీఆర్ఎస్ కార్యకర్త మృతి

■ అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

సిరికొండ, జూన్ 16 : మండలంలోని కొండూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రొండ్ల నరేందర్ (33) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. నరేందర్ అంత్యక్రియలను కొండూర్‌లో నిర్వహించగా.. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హాజరై బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే నరేందర్ మృతిచెందడం బాధాకరమని, బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని అన్నారు.

లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్‌గా విజయానంద్

ఖలీల్‌వాడి, జూన్ 16 : లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూరు అధ్యక్షుడి జిల్కార్ విజయానంద్ జోన్ చైర్మన్‌గా నియామకమయ్యారు. జిల్లా గవర్నర్ నగేశ్ పంపటి విజయానంద్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. విజయానంద్ లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్, కామారెడ్డి, కామారెడ్డి వివేకానంద, సదాశివనగర్ క్లబ్‌లకు జోన్ చైర్మన్‌గా వ్యవహరిస్తారని క్లబ్ సభ్యులు తెలిపారు. తనను జోన్ చైర్మన్‌గా నియామకం చేసిన జిల్లా గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విజయానంద్‌ను ఇందూరు క్లబ్ కార్యదర్శి చింతల గంగాదాస్, కోశాధికారి మచ్చ రవీందర్, యాదగిరి, లక్ష్మీనారాయణ, గురుప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

శక్కర్‌నగర్, జూన్ 16: ముస్లింలు బక్రీద్ పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ కోరారు. ఆదివారం రాత్రి బోధన్ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బక్రీద్ సందర్భంగా ఇబ్బందులలు ఏర్పడకుండా పోలీస్‌శాఖ చర్యలు చేపడుతోందని, పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. ఏవైనా సమస్యలుంటే పోలీసులకు తెలియజేయాలని పేర్కొన్నారు. పారిశుద్ధ్యంతోపాటు ఇతర ఏవైనా సమస్యలుంటే సంబంధిత శాఖల అధికారులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించాలని పేర్కొన్నారు. సమావేశంలో సీఐ సంజ్ర వీరయ్య, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

బక్రీద్ ఏర్పాట్ల పరిశీలన

ఏర్పాట్లను ఏఈ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలిస్తున్న కౌన్సిలర్లు

శక్కర్‌నగర్, జూన్ 16: బక్రీద్ సందర్భంగా సోమవారం ముస్లిములు ప్రార్థనలు నిర్వహించేందుకు బోధన్ పట్టణ శివారులోని ఈద్గావద్ద ఏర్పాట్లను మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. రోడ్డును శుభ్రం చేయించారు. నీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టారు. పనులను మున్సిపల్ ఏఈ సూర్య శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, కౌన్సిలర్లు తూము శరత్‌రెడ్డి, అబ్దుల్లా, మీర్ నజీర్ అలీ, జావీద్, ఇమ్రాన్ తదితరులు పరిశీలించారు.

పిరమిడ్ ధ్యాన మందిరానికి విరాళం

ఆర్మూర్‌టౌన్,జూన్15: పట్టణంలోని నవనాథ్ సిద్దుల గుట్టపై ఉన్న నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రానికి రూ.5లక్షల విరాళాన్ని భారతేంద్ర అందజేసినట్లు పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. పిరమిడ్ ధ్యాన మందిరంలో మార్బుల్స్ ఏర్పాటుకు వినియోగిస్తామని పేర్కొన్నారు.

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

వినాయక్‌నగర్, జూన్ 16 : నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. రైల్వే ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని పోచమ్మగల్లీకి చెందిన గైని సురేశ్ (39) ఆదివారం తెల్లవారుజామున 3.40 గంటలకు కాచిగూడ నుంచి జైపూర్ వెళ్తున్న లాల్‌గాడి ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని రైల్వే పోలీసులు పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు రైల్వే ఎస్సై తెలిపారు.

గడ్డి మందు తాగి ఒకరి ఆత్మహత్య

బాల్కొండ, జూన్ 16: బాల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాల్కొండకు చెందిన బోడిగంవర్ రవిబాబు (22) గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై రాజేశ్వర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఏఎస్సై కథనం మేరకు.. రవిబాబు ఈనెల 11న సాయంత్రం గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి తండ్రి హన్మంతు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై పేర్కొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మోస్రాలో సమావేశమైన 1990-1991 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

చందూర్/ ఏర్గట్ల/ మాక్లూర్, జూన్ 16 : మోస్రా మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990-1991లో పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని జరుపుకొన్నారు. మోస్రాలోని మోటాడిరెడ్డి సంఘం ఇందుకు వేదికైంది. పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపైకి చేరి పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం వారు చేస్తున్న ఉద్యోగాలు, కుటుంబీకుల వివరాలను తెలుసుకొని, ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. వారికి చదువు చెప్పిన గురువులను కార్యక్రమానికి ఆహ్వానించి సన్మానం చేశారు. ఆదిలాబాద్ ఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తున్న పూర్వవిద్యార్థి వినోద్‌కుమార్‌ను సైతం సన్మానించారు. కార్యక్రమంలో గోవూర్ సొసైటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు. ఏర్గట్ల మండలంలోని తొర్తి జడ్పీ ఉన్నత పాఠశాల 2015-16 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయులను సన్మానించారు. మాక్లూర్ మండల కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో 1997-98 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒకచోటచేరి చిననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ గురువులను సన్మానించి పాదాభివందనం చేశారు.

మాక్లూర్‌లో సమావేశమైన 1997-98బ్యాచ్ విద్యార్థులు

తొర్తిలో 2015-16 బ్యాచ్ విద్యార్థులు

పలు అంశాలపై కబడ్డీ అసోసియేషన్ తీర్మానం

మాట్లాడుతున్న అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లింగయ్య

ముప్కాల్, జూన్ 16: మండల కేంద్రంలో ఆదివారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ విస్తృత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు అందాల లింగయ్య అధ్యక్షతన తొలిసారిగా నిర్వహించినట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్‌రెడ్డి తెలిపారు. పలు అంశాలపై తీర్మానాలు చేసినట్లు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సుబ్బరావు, ట్రెజరర్ సురేందర్, జాయింట్ సెక్రటరీ రాజ్‌కుమార్, హరిచరన్, శ్రీను, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

యువకులకు కిట్లను అందజేస్తున్న వైస్ ఎంపీపీ యోగేశ్

క్రికెట్ కిట్ల అందజేత

రెంజల్, జూన్ 16: మండలంలోని నీలా గ్రామంలో ఆదివారం యువకులకు క్రికెట్ కిట్లను అందజేసినట్లు వైస్ ఎంపీపీ క్యాతం యోగేశ్ తెలిపారు. యువత చదువుతోపాటు క్రీడలపై దృష్టిసారించాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు బండారి రవి, ఎమ్మార్పీఎస్ నాయకులు పోశెట్టి, అనిల్, రమేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువలో డ్రైనేజీ నీరు

రెంజల్, జూన్ 16: మండలంలోని సాటాపూర్‌లో సాగునీటి కాలువలో హోటళ్లలోని వ్యర్థాలను కాలువలో పారవేస్తున్నారు. చెత్తాచెదారం నిండి దుర్వాసన వ్యాపిస్తోంది. పందులు స్వైర విహారం చేస్తున్నాయి. కాలువ ఇలాగే ఉంటే ఆయకుట్ట పంటలకు సాగునీరు అందకుండా పోతుందని రైతన్నలు వాపోతున్నారు. అధికారులు స్పందించి కాలువలోని చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

సాటాపూర్‌లో మురుగు నీటితో నిండిన సాగునీటి కాలువ